


**(గత సంచిక తరువాయి)**

"**తను గర్భవతి** అని తెలియగానే ప్రతీ యూదు స్త్రీ పుట్టబోయే సంతానం తెలివిగలవారు అవాలని కొన్ని నియమాలని పాటిస్తుంది. ఇది మరే ఇతర మతస్థులూ చేయరు. పాడుతూ, పియానో వాయిస్తుంది. తన భర్తతో కలిసి లెక్కలు చేస్తుంది. గర్భవతులు లెక్కల పుస్తకాలని వెంట ఉంచుకోవడం నేను చూసాను. అది గర్భంలోని తమ బిడ్డ తర్వాత మేధావిగా అవడానికి ఇచ్చే శిక్షణగా వారు నమ్ముతారు. బిడ్డ పుట్టేదాకా తల్లి లెక్కలు చేస్తూంటుంది. గర్భవతులు బాదం పప్పుని, ఖర్జూర పళ్ళని, పాలని అధికంగా తీసుకుంటారు. బ్రేక్‌ఫాస్ట్‌గా బ్రెడ్, నట్స్, చేప కలిపిన సలాడ్‌ని తీసుకుంటారు. మెదడు పెరుగుదలకి చేప మంచిది కాదని వారి నమ్మకం. కాబట్టి చేప తలని తినరు. ఐతే మాంసం, చేప కలిపి తినడం పుట్టే బిడ్డకి మంచిది కాదని గర్భవతులు ఆ రెండూ కలిపి తినరు. గర్భవతులు కాడ్లివర్ ఆయిల్ తీసుకుంటారు. భోజనానికి ముందు పళ్ళు తింటారు. నికొటిన్ బిడ్డ బ్రెయిన్ సెల్స్‌ని నాశనం చేసి బుద్ధిమాంద్యంతో పుడతారని వారి నమ్మకం. కాబట్టి గర్భవతులు సిగరెట్ తాగరు. తర్వాతి పరిశోధనల్లో ఇది నిజమని ఋజువైంది. కాని సిగరెట్ వ్యాపారం యూదుల చేతుల్లోనే ఉండటం విశేషం.

"ప్రార్థనా సమయంలో వాళ్ళు తలని వేగంగా కదుపుతారు. ఇందువల్ల మెదడుకి ఎక్కువ ఆక్సిజన్ లభిస్తుందని వారి నమ్మకం. తలని వంచి అభివాదం చేసే జపనీస్ కూడా తెలివిగలవాళ్ళే. పిల్లలు బ్రేక్‌ఫాస్ట్‌గా ముందు పళ్ళు, బాదంపప్పు తిని కాడ్‌లివర్ ఆయిల్‌ని తాగుతారు. సగటున యూదు పిల్లలకి మూడు భాషలు వచ్చు. అవి హిబ్రూ, అరబిక్, ఇంగ్లీష్. పిల్లలు బాల్యం నించే పియానో, వయొలిన్‌లు వాయించడం తప్పనిసరి. ఈ సాధన వారి మెదళ్ళలోని న్యూరాన్స్ మధ్య సంబంధం ఏర్పరిచి ఐక్యుని మేధస్సుని పెంచుతుంది. స్కూళ్ళల్లో ఒకటో తరగతి నించి ఆరుదాకా వ్యాపార లెక్కలు, సైన్స్ నేర్పుతారు. యూదుల స్కూల్లో విద్యార్థులు విలువిద్య, తుపాకీ షూటింగ్‌లాంటివి నేర్చుకుంటారు. ఇది మెదడుని ఏకాగ్రంగా ఉంచి సరైన నిర్ణయాలు తీసుకోడానికి ఉపయోగిస్తుంది. యూదు విద్యార్థుల్లో డాక్టర్ కోర్స్, సైన్స్ చదివేవాళ్ళు ఎక్కువ. యూనివర్సిటీలో ఆఖరి సంవత్సరం వ్యాపార విద్య తప్పనిసరి సబ్జెక్ట్. వారు చేసే ప్రాజెక్ట్‌లలో పది లక్షల అమెరికన్ డాలర్లు లాభం చూపిస్తేనే వాళ్ళు ఆ పరీక్ష పాసవుతారు. ఇందుకే ప్రపంచ వ్యాపారంలో సగభాగం యూదుల

చేతిలో ఉంది. లీవైజ్ జీన్స్‌ని డిజైన్ చేసింది ఇజ్రాయిల్లోని విద్యార్థే. వారిలో ప్రపంచ ప్రసిద్ధి చెందిన డాక్టర్లు, ఇంజనీర్లు, ఆయుధాల తయారీదారులు ఎక్కువ.

"వారు ఒకరికొకరు మద్దతుని ఇస్తారు. న్యూయార్కులోని ఏ యూదుకైనా ఓ కొత్త వ్యాపార ఆలోచన వస్తే యూదు సంస్థలు అతనికి వడ్డీలేని అప్పుని ఇస్తాయి. స్టార్‌బక్స్, డెల్ కంప్యూటర్లు, కోకోకోలా, ఒరాకిల్, డంకిన్ డోనట్స్, అనేక హాలీవుడ్ సినిమాలకి ఇంకా వందలకొద్దీ వ్యాపారాలకి యూదు సంస్థలనించే పెట్టుబడి లభించింది. న్యూయార్క్‌లోని యూదు డాక్టర్లకి ప్రైవేట్ ప్రాక్టీస్ చేయడానికి అవసరమైన పెట్టుబడికి వడ్డీలేని అప్పుని ఇస్తారు. వారిలో తమ కమ్యూనిటీవారు అభివృద్ధి చెందాలనే తపన ఉండటానికి కారణం తీవ్రమైన ఐకమత్య భావన. వారు ప్రపంచంలోని చాలా దేశాలనించి బహిష్కరించబడ్డారు. ముస్లింలు, క్రిస్టియన్స్ వారిని మతపరమైన కారణంగా అమితంగా ద్వేషిస్తారు. దీన్ని యాంటీ – సెమిటిజం అంటారు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో యూరప్‌లోని అరవై లక్షలమంది యూదులు డెత్ కేంప్ లలో నాజీ జర్మన్స్ చేతుల్లో చంపబడ్డారు."

"ఓ!"

"బలంగా ఉండటం తప్ప వేరే దారి లేనప్పుడు తాము ఎంత బలమైనవారో మనుషులకి అర్థం అవుతుందనుకుంటా. నేడు ప్రపంచంలో తిరుగులేని జాతి. అందుకే నేను నా కొలీగ్స్‌లోని యూదులతో కలిసి ఉండటానికే ప్రయత్నిస్తూంటాను. కారణం, ***మనం కలిసి ఉండే ఐదుగురు మనుషుల సగటే మనం. కాబట్టి మనకన్నా తెలివిగలవారి సమక్షంలో ఉండాలి.***"

"నువ్వు నీ బిడ్డల్ని యూదు సంప్రదాయాలతో పెంచుతావని పందెం" ఆద్య నవ్వుతూ చెప్పింది.

"కుదిరితే. నా ఆలోచన కూడా అదే" చైత్ర కూడా నవ్వింది.

"అలెక్సీ ఇంట్లో చాలా దేశాల వస్తువులు ఉన్నాయి" ఆద్య చెప్పింది.

"అవును. వీళ్ళు ఇంతదాకా పదిహేడు దేశాల్లో పనిచేసారు. మా కంపెనీ పాలసీ, బదిలీ చేసినప్పుడు ఉద్యోగస్థుల సామాను మొత్తం రవాణాకి అయే ఖర్చుని భరించడం. అందుకు షిప్‌లో పెద్ద కంటైనర్‌ని ఇస్తారు. ఫార్టీ ఫీట్ బై టెన్ ఫీట్ ఇలా. మా కంపెనీ షిప్పింగ్ ఏజంట్స్ పేకర్స్ ఇంటికి వచ్చి ఏదీ విరక్కుండా కార్టన్స్‌లో నైపుణ్యంగా పేక్ చేసి, షిప్ లోకి ఎక్కిస్తారు. తిరిగి వాటిని దింపి తెచ్చి మనింట్లో ఉంచుతారు. మనం బాక్స్‌లని విప్పి వాటిని తీసుకోవడమే. అందుకే ఆ దేశాల్లో కొన్న సూవెనీర్స్ అన్నీ భద్రంగా తీసుకెళ్ళచ్చు. అలెక్సీ జీతం ఎక్కువ. ఏడాదికి మూడున్నర లక్షల డాలర్లు. ఈజిప్ట్ పాపిరస్ పెయింటింగ్స్, బ్రెజిల్‌కి చెందిన పెయింటింగ్స్, నార్వే బిల్డింగ్స్ ఇలా సావనీర్స్‌గా కొన్నారు. విమానంలో అవసరమైన దుస్తులు, టాయ్‌లెటరీస్, కాస్మెటిక్స్, మందులులాంటివి మాత్రం ఒకటి, రెండు పెట్టెల్లో తీసుకుని వెళ్ళడమే. ఐతే ఓడ రావడానికి కొంతకాలం పడుతుంది. ఈలోగా అవసరమైనవి కొనుక్కోడానికి దేశాన్ని బట్టి మా కంపెనీ బదిలీ

ఐన మాకు కొంత అదనపు డబ్బు కూడా ఇస్తుంది. అమెరికాకి బదిలీ ఐనప్పుడు నాకు నాలుగువేల డాలర్లని ఇచ్చారు. అలాగే కొత్త దేశానికి వెళ్ళాక వారం రోజులు హోటల్ అకామడేషన్‌కి డబ్బు ఇస్తారు. ఈలోగా అద్దె ఇల్లు వెదుక్కోవాలి" చైత్ర చెప్పింది.

కొద్ది రోజులు క్రితమే చచ్చిపోవాలనుకున్న ఆద్య తను కూడా చదువయ్యాక అక్క పనిచేసే కంపెనీలో చేరాలని మనసులో అనుకుంది.

ఆ రాత్రి నిద్రపోయేముందు మొదటిసారి ఆద్యకి జినేంద్ర గుర్తురాలేదు.

20

సంజీవ మధ్యాహ్నం కాసేపు కునుకు తీసి నిద్రలేవగానే ప్రవర్ధన చెప్పింది.

"మీరు ఎప్పుడు నిద్రలేస్తారా అని ఎదురు చూస్తున్నాను. మౌనవిపంచిక వచ్చిందట."

"మొన్నీ మధ్యేగా అమెరికాకి వెళ్ళింది? ఎవరికైనా ఒంట్లో బాలేదా?" ఆయన ఆశ్చర్యంగా అడిగాడు.

"కాదు. ఎందుకు వచ్చిందో తెలుసుకుందాం పదండి ."

"సరే. ఫోన్ చేసి వస్తున్నామని చెప్పు."

మౌనవిపంచిక ప్రవర్ధన అక్కయ్య కూతురు. మూడు నెలల క్రితమే పెళ్ళి చేసి అమెరికాలో న్యూజెర్సీలోని ప్రిన్స్‌టన్‌కి పంపారు. ఆమె అంత త్వరగా రావడం ఆసక్తిని కలిగించడంతో పావుగంటలో బయలుదేరి అరగంటలో అక్క ఇంటికి చేరుకున్నారు.

"రావే ప్రవీ. ఎలా ఉన్నావు?" అక్క ఆహ్వానించింది.

"బానే ఉన్నా కాని ఇంట్లో నిజంగా అంతా కులాసానేనా?" ప్రవర్ధన అడిగింది.

"ఇద్దరం దుడ్డుముక్కల్లా ఉన్నాం మాఆరోగ్యానికేం ఢోకా లేదు."

"ఎలా ఉన్నారు?" షడ్డకుడు సంజీవని పలకరించాడు.

"బావున్నాను."

ఇరవై ఆరేళ్ళ మౌనవిపంచిక వారి మాటలు విని గదిలోంచి బయటకి వచ్చి పిన్నిని, బాబాయ్‌ని ఆనందంగా పలకరించింది.

"ఏమే? అప్పుడే మీ అమ్మానాన్నల మీద దిగులు పడ్డావా, వచ్చేసావు?" ప్రవర్ధన నవ్వుతూ అడిగింది.

"నాకు దిగులేమిటి? పెళ్ళికి మునుపు పూనాలో రెండేళ్ళు ఒంటరిగా ఉండి ఉద్యోగం చేయలేదా?" మౌనవిపంచిక జవాబు చెప్పింది.

"మరి? ఎందుకు ఇంత త్వరగా వచ్చావు?"

"అక్కడ ఉండలేకట" ప్రవర్ధన అక్క బాధగా చెప్పింది.

“ఏం? ఏమైంది? కొంపతీసి అదేదో సినిమాలోలాగా వాడికి ముందే పెళ్ళైందా?" ప్రవర్ధన అడిగింది.

"అలా ఐనా బానే ఉండేది. ఎడ్జస్ట్ అయేదాన్ని."

"ఏం జరిగిందే అసలు? చెప్పు" ప్రవర్ధన ఆదుర్దాగా అడిగింది.

"వాళ్ళ తీరు నాకు నచ్చలేదు పిన్నీ. కట్టు బానిస బతుకైపోయింది" బాధగా చెప్పింది.

ఆమె చెప్పేదాకా భార్యాభర్తలు మౌనంగా ఉన్నారు.

"వాళ్లది పరమ ఛాందస కుటుంబం. పొద్దున్న ఐదుకి లేచి కళ్ళాపు చల్లి ఇంటి బయట ముగ్గువేయాలి. తర్వాత స్నానం చేసి కాఫీ, టిఫెన్ల పని చూడాలి. మావారో చదువుకున్న మూర్ఖుడు. ఉదయం నిద్రలేచాక నేను స్నానం చేయకుండా ఆయనగారి కళ్ళబడకూడదు. అంతా చూస్తూంటే ఆయన పక్కన కూర్చోకూడదు. మాట్లాడకూడదు. ఆయనకి లంచ్ బాక్స్ ఇచ్చి అతను ఆఫీస్‌కి వెళ్ళాక మళ్ళీ స్నానం చేసి ఏడు గజాల చీరతో మడి కట్టుకుని వంట చెయ్యాలి. వంటయ్యాక అత్తగారికి, మామగారికి వడ్డించాలి. మా అత్తగారు బట్టలు వాషింగ్ మెషీన్‌లో వేస్తే కట్టదు. వాటిని రోజూ చేత్తో ఉతికి బేస్‌మెంట్లో పొద్దున ఉతికి ఆరేసి, మధ్యాహ్నం ఇస్త్రీ చెయ్యాలి. బయటికి వెళ్ళొచ్చినప్పుడల్లా ఎంత రాత్రైనా స్నానం తప్పనిసరిగా చెయ్యాలి. పొద్దునవి రాత్రి తినరు. మళ్ళీ రాత్రి మడి వంట. బుధవారం రాత్రి బియ్యం నానేసి గురువారాలు ఉదయం మిక్సీలో పిండి చేసి దాంతో రంగనాథుడి నైవేద్యంకోసం విరక్కుండా చక్రాలని, అరిసెలని వండాలి. రోజూ సూర్యాస్తమయ సమయంలో అరగంటసేపు పాండురంగ విఠలుడి భజనని ఇంటిల్లిపాదీ చెయ్యాలి. నేను ఎంటెక్ చదివినా జాబ్ చేయకూడదు. 'ఇక జీవితాంతం ఇంతేనా?' అని నాలో నిరాశ, భయాలు కలిగాయి. పాస్‌పోర్ట్ దాచేసారు. వెదికి ఎలాగో దాన్ని పట్టుకుని, వాల్‌మార్ట్‌కి అని చెప్పి సరాసరి నెవార్క్ ఎయిర్‌పోర్ట్‌కి చేరుకుని క్రెడిట్ కార్డ్‌తో టిక్కెట్ కొనుక్కుని కట్టుబట్టల్తో వచ్చేసాను."

గడ్డం మీద వేళ్ళు వేసుకుని ప్రవర్ధన, సంజీవ ఒకరి మొహాలు మరొకరు ఆశ్చర్యంగా చూసుకుంటూ అంతా విన్నారు.

"అన్నేళ్ళ క్రితం నువ్వు ఇంటర్ కేస్ట్ మేరేజ్ చేసుకుని హాయిగా ఉన్నావు పిన్నీ. అరేంజ్డ్ మేరేజ్ చేసుకుని నా గతి ఏమైందో చూడు. చైత్రకి, ఆద్యకి వేరే కులస్థులైనా బాబాయ్‌వైపు వాళ్ళతో పెళ్ళి చెయ్యి తప్ప మనవాళ్ళకిచ్చి చెయ్యక. ఇంత కాకపోయినా ప్రతీవారికీ కొంత ఈ మూఢభక్తి ఉంటుంది. లవ్ మేరేజ్ ఐతే ఇంకా బెస్ట్" మౌనవిపంచిక చెప్పింది.

"వాళ్ళు కాంప్రమైజై వెనక్కి పిలుస్తారంటావా?" సంజీవ భాధగా అడిగాడు.

ఇంటికి వచ్చాక ప్రవర్ధన చైత్రకి ఫోన్ చేసి మౌనవిపంచిక ఇండియా రావడం గురించి చెప్పింది.

"మంచి పని చేసింది" చైత్ర చెప్పింది.

"కానీ పండంటి సంసారాన్ని నాశనం చేసుకుంది కదా? వాళ్ళు మళ్ళీ రానివ్వకపోతే?" ప్రవర్ధన బాధగా చెప్పింది.

"అది నీకన్నా తెలివిగలది. అన్నీ ఆలోచించుకునే వచ్చింది. ఆ పిచ్చి చాకిరీ ఏమిటి, మూఢత్వం కాకపోతే. మౌన చేసింది నేను సమర్ధిస్తానమ్మా. అంత చదువుకున్నాక కూడా ఇంకా అత్తామామల అదుపాజ్ఞల్లో కోడళ్ళు ఉండాలనుకోవడం వెర్రితనం. విడాకులు తీసుకుని ఇంకో పెళ్ళి చేసుకోవడం ఈ రోజుల్లో చాలా తేలిక పని. పట్టుమని మూడు నెలలు కూడా కాపరం చెయ్యలేదంటే ఎవరైనా తేలిగ్గా అర్థం చేసుకుంటారు. పెద్దమ్మ, పెదనాన్న దీన్ని ఎలా రిసీవ్ చేసుకున్నారు?" చైత్ర అడిగింది.

"బాధ ఉంటుంది. కాని కూతురు చేసిన పని సబబైనదేనని ఒప్పుకున్నారు. ఎవరో మంచి సంబంధం అంటే పూర్వాపరాలు విచారించి, మంచివాళ్ళని నిశ్చయించుకుని పెళ్ళి చేసారు. కాని ఈ సంప్రదాయాల పిచ్చి గురించి తెలీదు."

"దేవుడిని మనిషి పరిమితుల్లో ఉంచాలమ్మా. లేదా ఇదిగో ఇలాగే అవుతుంది. వాళ్ళెవరో తిరుమలకి మెట్టు మెట్టుకీ బొట్టుపెట్టి, దీపం వెలిగించి నడిచి వెళ్ళే మొక్కు మొక్కుకుని సగం దూరం వెళ్ళాక నడుం పట్టుకుపోయి స్ట్రెచర్లో తీసుకెళ్ళాల్సి వచ్చిందని పేపర్లో చదివాను" చైత్ర చెప్పింది.

"అంతా అమెరికా సంబంధం వచ్చిందని సంబరపడ్డాం. దిష్టి తగిలి ఉంటుంది. జీవితంలో ఇదో పాఠం. పెళ్ళి సంబంధం చూసేప్పుడు దేవుడికి, వారికి గల సంబంధాన్ని కూడా తెలుసుకుని మరీ పిల్లని ఇవ్వాలి" ప్రవర్ధన చెప్పింది.

స్పీకర్ ఫోన్‌లో ఆద్య కూడా ఆ సంభాషణ విన్నది. లైన్ కట్ చేసాక చైత్ర చెప్పింది.

"రెండు వారాల క్రితమే మౌన నాకు ఈ మెయిల్ చేసి సలహా అడిగింది. నెలసరి వచ్చినప్పుడు ఐదు రోజులూ బేస్‌మెంట్లోనే గడపాలి. ఆ ఐదు రోజులూ ఎవరికీ కనపడకూడదట. తలుపు ఓరగా తెరిచి అన్నం కంచం, నీళ్ళ సీసాలు పడేస్తారట. న్యూజెర్సీలో మంచుపడే చలిలో కాళ్ళకి చెప్పులు లేకుండా పోర్చ్‌లో తెల్లవారుఝామున ఐదుకి ముగ్గు వేయాల్సివస్తోందని చెప్పగానే విడిపొమ్మని సలహా ఇచ్చాను. వాళ్ళని నేను మానవత్వంలేని నాజీలు, బానిస వ్యాపారులు, సిరియన్ ఉగ్రవాదులతో సమానంగా భావించాను."

ప్రేమలోనే కాదు. పెళ్ళిలో కూడా ఎన్ని బాధలో అనుకుంది ఆద్య.

## 21

మర్నాడు సాయంత్రం చైత్ర ఆఫీస్‌నించి వచ్చాక ఆద్యతో చెప్పింది.

"పద. గెట్ డ్రెస్డ్. ఇవాళ స్విమ్మింగ్‌లో కొత్త లెసన్ నేర్పుతాను."

ఇద్దరూ స్విమ్మింగ్ డ్రస్ వేసుకుని పూల్ దగ్గరకి చేరుకున్నారు.

"కాళ్ళని ఎలా కదపాలో నీకు బాగా పట్టుబడింది. నీళ్ళమీద పొట్టమీద బోర్లా పడుకుని మోకాళ్ళనించి పాదాల దాకానే కాళ్ళని ఒకదాని తర్వాత మరోటి కిందకి పైకి నైన్టీ డిగ్రీస్‌లో కదిపే అభ్యాసం చెయ్యి" చైత్ర ఎలాగో చేసి చూపిస్తూ చెప్పింది.

ఆద్య కొద్దిసేపు అలా చేసాక చెప్పింది.

"ఇప్పుడు నీళ్ళమీద బోర్లాపడుకుని చేతులని ముందుకి చాచి వెనక్కి చాచుతూండాలి. నిన్ను పట్టుకుంటాను. ప్రాక్టీస్ చెయ్యి. అలాకాదు. ఎలాగో నీకు చూపిస్తానుండు."

ఆద్య చేత అరగంటసేపు ప్రాక్టిస్ చేయించింది.

"నా చదువయ్యాక నీ కంపెనీలో నాకు ఉద్యోగం వస్తుందా? నువ్వు రికమెండ్ చేస్తావా?" తిరిగి వచ్చాక ఇద్దరూ కాఫీ తాగుతూంటే ఆద్య అడిగింది.

"తప్పకుండా. కాని నాకో వ్యక్తిగత సమస్య ఉంది. అది నీకూ రావచ్చు."

"ఏమిటది?"

"పెళ్ళా? కెరీరా? అన్నది ఎంచుకోవాల్సి వస్తుంది. చూస్తూనే ఉన్నావుగా? జీవితాంతం ఒకే ఊళ్ళో ఉండి చేసే, హైద్రాబాద్‌లో నాన్న ఉద్యోగం లాంటిది కాదిది. మాది మల్టీ నేషనల్ కార్పొరేషన్. ఏ దేశానికి బదిలీ చేస్తే అక్కడికి వెళ్ళాలి. పెళ్ళయ్యాక నా భర్త కూడా ప్రతీసారి నా వెంట ఆ దేశానికి డిపెండెంట్‌గా వెళ్ళాలి. కొత్త ఉద్యోగం వెదుక్కోడానికి వీసా కండిషన్స్, వర్క్ పర్మిట్‌లాంటి అడ్డంకులు ఉంటాయి. దాంతో ఇద్దరం చెరో దేశంలో గడపాల్సి ఉంటుంది. ఇంక పెళ్ళి చేసుకుని ఏం లాభం?"

"అలాంటప్పుడు నువ్వు ఉద్యోగం మానేసి అదే ఊళ్ళో వేరే జాబ్ చూసుకోవచ్చుగా?"

"నాకది ఇష్టంలేదు. నేను నా కెరీర్‌లో వేగంగా పైకి వెళ్తున్నాను. నాకు నా నేచరాఫ్ జాబ్ ఇష్టం. పెళ్ళి, కెరీర్లో ఏదో ఒకటే ఎంపిక చేసుకోవడం నా జీవితంలోని మేజర్ డెసిషన్. కెరీర్నే ఎన్నుకున్నాను. నా కొలీగ్స్ ఒకరిద్దరు నన్ను పెళ్ళి చేసుకోవాలని ప్రపోజ్ చేసారు కూడా. నేను ఏ కల్చర్‌లోనైనా ఇమడగలను. కాని మళ్ళీ ఇందాక నేను చెప్పిన సమస్యే. భార్యాభర్తలు ఇద్దర్నీ ఒకే దేశానికి బదిలీ చేసే నియమం మా కంపెనీలో ఉంది. కాని ఇద్దరిలో ఒకరి జాబ్ రెండో దానికన్నా తక్కువ ప్రాముఖ్యతగలదాన్ని తక్కువ జీతంతో  ఆఫర్ ఇస్తారు. మా కొలీగ్ వెరా విబావా అనే ఇండోనేషియన్ జీతం పెరిగి, ఆమె భర్తది తక్కువవడంవల్ల అహంకారంతో భర్తనించి విడాకులు తీసుకుంది. విబావా మన రెడ్డి, శాస్త్రిలా ఓ కులం పేరు. ఫ్రైడే ఆమెని నువ్వు కలుస్తావు. మా కంపెనీలో ఇండోనీషియన్స్ ఎక్కువ. భార్యకి కీ పొజిషన్‌తో ఎక్కువ జీతం వస్తే మేల్ ఇగో పనిచేసి భర్తలు అడ్జస్ట్ కాకపోవడం చాలా చూసాను."

"ఓ! కాని అమ్మ నీ పెళ్ళి గురించి తెగ మధనపడిపోతోంది."

"నాది ఇంకా ఇండియన్ పాస్‌పోర్టే. నాకు బిడ్డలు పుట్టేప్పుడు ఏ దేశంలో ఉంటానో తెలీదు. కెనడా, అమెరికాల్లో పుడితే బిడ్డకి ఆ దేశ పౌరసత్వం ఇస్తారు. దుబాయ్, ఇటలీలాంటి దేశాల్లో పుడితే ఆ దేశపౌరసత్వం రాదు. మా కంపెనీ అమెరికన్ గ్రీన్‌కార్డ్‌కి ఓ పట్టాన స్పాన్సర్ చెయ్యదు. కాబట్టి చివర్లో నేను ఇండియాకే వచ్చే పక్షంలో నా భర్త విదేశస్తుడైతే అతను అక్కడ నాతో ఉండటానికి అడ్జస్ట్ కాలేకపోవచ్చు. పెళ్ళి సుఖపడాలని చేసుకుంటాం కదా. తండ్రో దేశంలో, తల్లో దేశంలో ఉంటే మా బిడ్డల బాల్యం బావుండదు. పెళ్ళి చేసుకుంటే ఇలాంటి అనేక సమస్యలని అనుభవిస్తూ జీవించాల్సి ఉంటుంది. అందుకని పెళ్ళిని వాయిదా వేస్తూ వస్తున్నాను."

ఆ సంభాషణ తర్వాత ఆద్యకి అక్క లైబ్రరీలోని ఓ పుస్తకం మార్జిన్‌లో రాసుకున్న వాక్యం గుర్తొచ్చింది. ***'పెళ్ళికి ముందు ఐ లవ్ యు, పెళ్ళయ్యాక 'ఐ యాం సారీ ' ఆనందకరమైన వైవాహిక జీవితానికి పునాదులు.'***

చైత్ర ఓ పెట్టెని తెచ్చి అందులోని శాటిన్ లైనింగ్‌లోంచి కొన్ని వస్తువులని తీసి చూపిస్తూ చెప్పింది.

"ఇవేమిటో నీకు తెలుసా?"

"తెలీదు" ఆద్య ఆ పొడుగాటి వాటిని చూసి తల అడ్డంగా ఊపింది.

"పుస్తకాలు చదివేవాళ్ళకి ఇవి తెలుస్తాయి. బుక్‌మార్క్స్. పుస్తకంలో ఎంతదాకా చదివామో తెలుసుకోడానికి వీటిని పేజీల మధ్య ఉంచుతాము. కొన్ని పుస్తకాల్లో బుక్‌మార్క్‌గా దళసరి దారాన్ని కుడతారు. మరికొన్నిటిలో పబ్లిషర్ తన ఇంకో ప్రచురణ వివరాలు అచ్చు వేసిన బుక్ మార్క్‌ని ప్రకటనకోసం పుస్తకంలో ఉంచుతాడు. విదేశీ లేదా పాత నాణాలని, పోస్టల్ స్టాంప్స్‌ని సేకరించినట్లే వీటిని సేకరించే హాబీ నాకుంది" వాటిని ఒకొక్కటీ చూపిస్తూ వివరించింది. "ఇది శాండల్‌వుడ్‌తో చేసిన బుక్‌మార్క్. కాలేజీలో కర్నాటక ఎక్స్‌కర్షన్‌కి వెళ్ళినప్పుడు కొన్నాను. దీన్ని తేలిగ్గా గుర్తుపడతావు. ఏనుగు తలున్న ఇది ఏనుగు దంతంతో చేసింది. థాయ్‌లాండ్‌లో కొన్నాను. పటాయాలో. ఇది సూడాన్‌లో కొన్నాను. ఒంటె చర్మంతో చేసారు. దీనికి ఎంత అందమైన కుచ్చుందో చూసావా? ఇది పాపిరస్‌తో చేసింది. ఈజిప్ట్‌లో కొన్నాను. దీనిమీద పెయింట్ చేసింది పురాతన ఈజిప్షియన్ లిపి. హైరోగ్లిఫ్స్. వెన్నెముక ఆకారంలోని ఇది గోల్డ్ ప్లేటెడ్ మెటల్‌తో చేసింది. పారిస్‌లో కొన్నాను. ఈ నల్లది ఏంటిక్ మెటల్‌తో చేసింది. ఇది రెండో ప్రపంచ యుద్ధంలో కొందర్ని చంపిన గన్ మెటల్‌తో తయారైంది. దీంతో ఇచ్చిన కాగితంలో ఆ గన్ నంబర్, ఏ దేశ సైనికులని చంపింది సర్టిఫికెట్ ఉన్నాయి. ఆసక్తిలేక నేను ఇంతదాకా దాన్ని చూడలేదు."

"ఇది నిజం పువ్వా?" ఒకదాన్ని చూసి ఆద్య అడిగింది.

"అవును. సునామీ సర్వైవర్స్ పేపర్ మీద పువ్వుని ప్రెస్ చేసి పూల స్టెమ్ ని రెసిన్ పూతతో ప్రిజర్వ్ చేసారు. దీన్ని హేండ్‌మేడ్ పేపర్‌తో చేసారు. స్కేల్‌లా కూడా ఉపయోగించేలా అంగుళాలు, మిల్లీమీటర్లని ఇచ్చారు చూసావా? ఈ ప్లాస్టిక్ బుక్‌మార్క్‌ని దువ్వెనలా కూడా వాడుకోవచ్చు. ఓక్ చెక్కతో చేసిన ఇది కవర్ ఓపెనర్ కమ్ బుక్‌మార్క్.

అమెరికాలో పెన్సిల్వేనియా స్టేట్‌లో కొన్నాను. ఇది మేగ్నెటిక్ బుక్‌మార్క్. ఈ క్లిప్‌కి ఓ వైపు ఇనుము, మరోవైపు అయస్కాంతం ఉన్నాయి. దీని మధ్య పది కాగితాలదాకా ఉంచచ్చు. ఇది విన్సెంట్ వాన్ గాగ్ చిత్రం ప్రింట్ చేసిన బుక్‌మార్క్. ఇది హేండ్‌మేడ్ పేపర్ మీద ప్రింట్ చేసారు. ఇది హేరీ పాటర్ థీమ్డ్ బుక్మార్క్. ట్వైన్ దారానికి పూసలని గుచ్చి దీన్ని బుక్‌మార్క్‌గా నేనే చేసాను."

"ఇది బావుంది. త్రీ –డీ బుక్ మార్క్ కదా?" పక్కదాన్ని అందుకుని ఆద్య అడిగింది.

"అవును. నా హాబీ గురించి తెలిసిన ఓ కొలీగ్ ఆస్ట్రేలియా నుంచి గిఫ్ట్‌గా తెచ్చాడు."

"వీటిమీద ఇవేం జంతువులక్కా?"

"పోలార్ బేర్. ఇది బట్టని దళసరిగా కుట్టి చేసింది. దీని కుచ్చు కూడా బావుంది కదా? ఇది ఫన్ కోట్స్ బుక్‌మార్క్స్ సెట్."

ఆద్య వాటిని చదివింది. 'ఐయాం బుక్ వార్మ్ నాట్. బుక్ డ్రాగన్, ఎస్ సో మెనీ బుక్స్, సో లిటిల్ టైం, నెవర్ జడ్జ్ ఏ బుక్ గ్రో, షెర్లాక్ హోంస్ సిల్‌హౌటీ కింద టు ఏ గ్రేట్ మైండ్ నథింగ్ ఈజ్ లిటిల్ అని ఉంది. ఐఫిల్ టవర్, బిగ్‌బెన్, టోక్యో టవర్ ఫోటోలతో ఆ ఆకారాల్లోని బుక్‌మార్క్స్, చాలా పుస్తకాలతోపాటు వచ్చిన ఆ పుస్తకం కవర్ పేజ్ లేదా ఆ రచయిత ఇతర పుస్తకాల జాబితాగల బుక్ మార్క్స్ డజన్లకొద్దీ ఆ పెట్టెలో ఉన్నాయి. మరో బుక్ మార్క్‌ని చూసి ఆద్య అడిగింది.

"అరె! హేరీ పాటర్ పుస్తకం అట్టని చింపి బుక్‌మార్క్‌గా చేసావేమిటి?"

"ఇది షికాగోలోని ఓ బుక్ షాప్ వాడి తెలివి. షాప్‌లో డిస్‌ప్లే కోసం అట్టలని కూడా పబ్లిషర్ పంపుతాడు. వాటి పనయ్యాక వాటిని బుక్‌మార్క్‌లుగా కట్ చేసి 'ప్లీజ్ యూజ్ ఒన్' అని రాసిన ఓ అట్టపెట్టెలో వాటిని ఉంచాడు. అలా కవర్ పేజెస్‌ని పారేయకుండా తెలివిగా అతను ఉపయోగించాడు. దీన్ని నేను తీసుకున్నాను" చైత్ర వివరించింది.

"అమ్మ మన చిన్నప్పుడు పుస్తకం చదువుతూ పేజీని ఓ మూల మడిచేది కదా?" ఆద్య నవ్వుతూ అడిగింది.

"అవును. పుస్తకాన్ని పాడుచేయడం నాకు ఇష్టం ఉండదు. కాలేజీలో చదివేప్పుడు నేను కొత్త ప్లాస్టిక్ టంగ్ క్లీనర్ని బుక్‌మార్క్‌గా వాడేదాన్ని" చైత్ర చెప్పింది.

"గుర్తుంది" ఆద్య నవ్వి చెప్పింది.

ఆ తర్వాత ఆద్య చిన్నప్పటి కబుర్లని గుర్తుచేస్తే ఇద్దరూ నవ్వుకున్నారు.

"మొదటిసారి నాన్న మనల్ని బషీర్‌బాగ్‌లోని హోటల్ షాన్‌బాగ్‌కి తీసుకెళ్ళినప్పుడు చివర్లో ఫింగర్‌బౌల్ ఇస్తే అందులోని నిమ్మకాయ ముక్కని నేను ఆ వేడినీళ్ళలో పిండుకుని తాగాను కదా?" ఆద్య గుర్తు చేసింది.

చైత్ర అది మర్చిపోయింది.

"నువ్వు నా దుప్పటిమీద నీళ్ళుపోసి తడిపేసావు. నేను అమ్మకి చెప్తానంటే, ఒద్దు, మర్నాడు చాక్లెట్ కొనిస్తానంటే సరే అన్నాను. మర్నాడు నువ్వు కొనివ్వలేదు. నేనూ మర్చిపోయాను. ఓ రోజు గుర్తొచ్చి గుర్తుచేస్తే 'నీ దుప్పటిని ఎప్పుడు తడిపాను డాలీ?' అన్నావు గుర్తుందా?" ఆద్య అడిగింది.

"నీ దుప్పటిని ఎప్పుడు తడిపాను డాలీ?"

"నిజం చెప్పక్కా. ఇప్పుడు చాక్లెట్ కొనివ్వమని అడగడం లేదుగా?"

"నీ దుప్పటిని ఎప్పుడు తడిపాను డాలీ?"

ఇద్దరూ ఫక్కున నవ్వుకున్నారు.

"పొరపాట్న నా గ్లాస్ చేతిలోంచి జారి నీ దుప్పటిమీద పడింది తప్ప నేను కావాలని తడపలేదు" చైత్ర వివరించింది.

"నీలో నువ్వు పాటలు పాడుకుంటావు కదా?" ఆద్య అడిగింది.

"అవును. ఒంటరిగా ఉన్నవాళ్ళే ఎక్కువగా తమలో తాము పాడుకుంటారు. పాడేప్పుడు శరీరంలోని ఆందోళన, వత్తిళ్ళకి ఉపశమనం కలిగించే హార్మోన్స్ విడుదలవుతాయి, పాడటం మన మెదడులో మార్పుని తెస్తుంది. అందుకే శ్రమ తెలీకుండా ఉంటుందని పొలం పని చేసేవారు, ఓడ సరంగులు పాడుతూ పని చేస్తారు."

"నువ్వు ఇల్లు వదిలి ఎనిమిదేళ్ళైంది కదా? ఎప్పుడైనా హోం సిక్ ఫీల్ అయ్యావా?" ఆద్య అడిగింది.

"ష్యూర్. అమెరికాలో యూనివర్సిటీలో చదివేప్పుడు మొదటి ఆర్నెల్లు. తర్వాత పారిస్‌లో. ఫ్రెంచ్ భాష రాదు. అంతా కొత్త సంస్కృతి. చాలా ఫీలయ్యాను."

"హౌ డిడ్ యు కోపప్ వితిట్?"

"చాలా త్వరగా అందులోంచి బయటపడ్డాను. వర్క్. వర్క్. పనిమీద కాన్సన్‌ట్రేట్ చేసాను. వీకెండ్స్‌కి ఫోన్‌లో గూగుల్ మేప్‌లో రూట్ చూసుకుంటూ ట్రైన్‌లో సైట్ సీయింగ్‌కి వెళ్ళేదాన్ని. బయట తినకుండా ఇంట్లో హెల్దీ కుకింగ్ చేసుకునేదాన్ని."

"అవును. ఇన్‌స్టాగ్రాంలోని నీ 'డేన్సింగ్ స్పైసెస్'లో వాటిని పోస్ట్ చేసేదానివిగా?"

"అవును. మోటివేషన్ బుక్స్ కూడా బాగా చదివేదాన్ని."

ఆ రాత్రి చైత్ర ఆవకాడో పచ్చడి చేస్తూ ఆద్యకి చూపించింది. ఇండియానించి తెచ్చిన గోంగూర, టమోటా పచ్చళ్ళ సీసాలని తెరిచారు.

"అక్కా! ఈ పచ్చడి భలే ఉంది" ఆద్య ఆవకాడో పచ్చడి మొదటి ముద్ద తినగానే చెప్పింది.

రాత్రి పడుకునేముందు అక్క లైబ్రరీలోని పుస్తకాల్లోంచి చేతికి వచ్చిన పుస్తకాన్ని తీసుకుంది. విక్టర్ ఫ్రాంక్ రాసిన మేన్స్ సెర్చ్ ఫర్ మీనింగ్‌లో చేతికొచ్చిన పేజీని తెరిచి చదివింది.

'ఓ అర్ధరాత్రి నాకో అమ్మాయి ఫోన్ చేసి, తను ఆత్మహత్య చేసుకునేముందు నాకు ఫోన్ చేస్తున్నానని చెప్పింది. నేను వద్దని వారించి ఆమెలోని నిరాశని, అధైర్యాన్ని పారద్రోలి జీవించడానికి అనేక మాటలు చెప్పాను. చివరికి తను ఆత్మహత్య చేసుకోనని మాట ఇచ్చింది. 'మీ మాటలవల్ల ప్రభావితమైకాదు. ముక్కు, మొహం తెలీని నాకోసం అర్ధరాత్రి దాటాక గంటన్నర సమయాన్ని వెచ్చించే మంచి మనిషి ఉన్న ఈ మంచి ప్రపంచాన్ని విడిచివెళ్ళకూడదు అనిపించి' అని చెప్పింది. కాబట్టి ఎవరు మీ సమీపానికి వచ్చినా వారిని నిర్లక్ష్యం చేయకండి. అలాంటి అవకాశం వస్తే దాన్ని వృథా చేసుకోకండి. కొన్ని సందర్భాల్లో అదో ప్రాణాన్ని కాపాడకపోవచ్చు. కాని వారికి అది ఎంతో ఊరటని ఇస్తుంది. ***మనకి తెలీని చాలామంది మంచి మనుషులతో ఈ ప్రపంచం నిండి ఉందని తెలీకనే చాలామంది ఓ చెడ్డ వ్యక్తి గురించి ఈ ప్రపంచాన్ని వదిలిపెడుతూంటారు.***'

ఆద్య పుస్తకం మూసి దాని గురించి కొద్దిసేపు ఆలోచించింది.

***(కొనసాగింపు వచ్చే నెలలో)***

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**
www.anandbooks.com
www.telugubooks.in

Post your comments